క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కల్చరల్: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట, గంభీరావుపేటల్లో అకౌంటెంట్, వేములవాడ అర్బన్ కేజీబీవీలో ఏఎన్ఎం పోస్ట్ ఖాళీగా ఉన్నాయన్నారు. అకౌంటెంట్ పోస్టుకు కామర్స్ లేదా కంప్యూటర్స్‌లో డిగ్రీతోపాటు బేసిక్ కంప్యూటర్ కోర్సులో సర్టిఫికెట్ కలిగి ఉన్న స్థానికులు అర్హులన్నారు. ఏఎన్ఎం పోస్టుకు వృత్తి విద్యాకోర్సులో జీఎన్ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఆగస్టు 11లోపు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. 14న మెరిట్ లిస్ట్, 18వరకు అభ్యంతరాలు, 20న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

కళాకారుడికి సన్మానం



సత్యంను సన్మానిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ చిత్రకళాకారుడు వడ్డెపెల్లి సత్యంను జగిత్యాలలో గురువారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. సిరిసిల్లలో నాలుగు దశాబ్దాలుగా చిత్రకళారంగంలో రాణించడంతో పాటు పలు ప్రయోగాలు నిర్వహించి శిల్పకళలో గుర్తింపు తెచ్చుకున్న సత్యంను ఈ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపెల్లి రాజేశ్వర్, రామకృష్ణ, సత్యనారాయణ, మైదం మల్లేశం, జిల్లా బాధ్యులు గుండేటి రాజేశం, శ్రీనివాస్, చాకి శ్రీనివాస్, నజీర్, కృష్ణ, వడ్లూరి శంకర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

కోనరావుపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు నాణ్యతతో అందించాలని ఎంఈవో దూస రఘుపతి అన్నారు. మండలంలోని కొలనూర్, మర్తనపేట, రాంనగర్ (ధర్మారం), ధర్మారంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందు విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయనవెంట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మురళీనాయక్, ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి, శంకర్, రాంప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

4న అఖండ భజన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజు గురుస్వామి

ముస్తాబాద్: అయ్యప్పస్వామి అఖండ భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజుగురుస్వామి అన్నారు. అఖిల భారత అయ్యప్పదీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో రాచర్లగొల్లపల్లి, బొప్పాపూర్‌లో చేపట్టిన అఖండ భజన కరపత్రాలను శుక్రవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఆగస్టు 4న గొల్లపల్లి, బొప్పాపూర్ గ్రామాల్లో అఖండ భజన కార్యక్రమాన్ని ప్రచార సమితి నిర్వహించనున్నట్లు తెలిపారు. అఖిల భారత అయ్యప్పస్వామి జాతీయ అధ్యక్షుడు రాజు దేశ్‌పాండే ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. శ్రీనివాస్, వెంకన్న, లక్ష్మీనారాయణ, బాలాజీ, దేవేందర్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన చెందొద్దు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పరిధిలో ఐఎఫ్‌సీ కోడ్ పొరపాటుతో రైతులకు రుణమాఫీలో జాప్యం జరిగిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రుణమాఫీ లిస్టులో తమ పేర్లు ఉండి రుణమాఫీ జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వ్యవసాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరితగతిన క్లియర్ చేసి రుణమాఫీ చేయాలని కోరారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కోరారు.

దర్గాకు తరలిన ట్రాలీ ఆటో యజమానులు

వేములవాడ: వేములవాడ ప్రాంత టాటాఏసీ ట్రాలీ ఆటో యజమానులు శుక్రవారం ఎల్లారెడ్డిపేట గొల్లపల్లి సత్తెపీరీల దర్గాకు తరలివెళ్లారు. పాపన్నచౌక్ నుంచి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తరలివెళ్లారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్నం సంపత్, ఉపాధ్యక్షుడు పల్లికొండ నారాయణ, ప్రధాన కార్యదర్శి గసికంటి అశోక్ కోశాధికారి మల్లయ్య, యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



ముస్తాబాద్: ముస్తాబాద్ – దుబ్బాక రహదారి బురద, గుంతలమయంగా మారింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వానలకు ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి పట్టణ శివారు వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ముస్తాబాద్, దుబ్బాక రహదారి విస్తరణ పనులు చేపడుతారని కనీసం మరమ్మతు పనులు కూడా చేయడం లేదు. ఏడాది క్రితం మంజూరైన రోడ్డు విస్తరణ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. చినుకు పడితే రోడ్డుపై కాలుతీసి కాలు వేయలేని పరిస్థితి. ఈ రహదారి గుండా జెడ్పీ పాఠశాలలు, ఓ ప్రైవేట్ పాఠశాల ఉండదంతో పాటు సిద్దిపేట జిల్లా నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బురదరోడ్డుపై ఇబ్బందులు తొలగేలా మరమ్మతు పనులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలి

- ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్



డీటీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లటౌన్: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాల, కళాశాల బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీటీవో కార్యాలయంలో డీటీవోకు ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు చెలగాటమాడుతున్నాయన్నారు. విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారని, గతంలో కూడా పలుసార్లు ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని శ్రీచైతన్య పాఠశాల స్కూల్ బస్ ఆర్టీసీ బస్సు మధ్యన ప్రమాదం జరిగి ఉండేదని ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూల్స్, కాలేజీ బస్సులపై నిఘా ఉంచి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే డీటీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ ఫోరం కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్, వింగ్ ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజు రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



మొక్క నాటుతున్న జిల్లా విద్యాధికారి రమేశ్

వీర్నపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌ను జిల్లా విద్యాధికారి రమేశ్ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ టి శ్రీనివాస్, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ ఉదయలక్ష్మి, జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీ ఎస్ పాఠశాలల ఉపాధ్యాయ బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సిరిసిల్లటౌన్: తపాలాశాఖ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలపై సిరిసిల్ల సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ గజ్జల వేణు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తపాలా శాఖ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.రఘునందన్, తపాలా శాఖ మెయిల్ ఓవర్సీర్లు సాయిరాం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఎల్లారెడ్డిపేట: ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

కోనరావుపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ లక్కాకుల శ్రీదేవి అన్నారు. మండలంలోని నిజామాబాద్‌లో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వర్షాకాలంలో జాగ్రలు తీసుకోవాలని సూచించారు. కాచి వడబోసిన నీటినే తాగాలన్నా రు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. మురుగునీటి గుంతల్లో ఆయిల్ బాల్స్‌వేశారు. నీరు నిల్వ నీటిని పారబోయించారు. నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయని, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్, వైద్య సిబ్బంది శారద, లక్ష్మి, సీఏ వాణీశ్రీ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

28న వేములవాడ టౌన్ ముస్లిం కమిటీ ఎన్నికలు

వేములవాడ: వేములవాడ టౌన్ ముస్లిం కమిటీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపించే విధంగా కొనసాగుతున్నాయి. ఈనెల 28న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో కోశాధికారికి ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో ముషాహిద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు పోటీ అనివార్యమైంది. వీటికి అధ్యక్షుడి స్థానానికి అక్రమ్, రసూల్, యూసుఫ్ ముగ్గురు పోటీలో ఉండగా, ప్రధాన కార్యదర్శికి షాహిద్, వలిమొహమ్మద్, ఇర్ఫాన్‌లు పోటీ పడుతున్నారు. ఎలక్షన్ ఆఫీసర్లు సయ్యద్ సాబీర్, సయ్యద్ బాబా, శకీల్, అజ్మత్, అతహుర్రహిమాన్, శబ్బీర్, ఎండీ రఫీక్ అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఐదు రోజులుగా తమ గుర్తులతో అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ముస్లిం టౌన్ కమిటీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తలపిస్తున్నాయంటూ పట్టణంలో చర్చనీయాంశమైంది.

కార్గిల్ అమరులకు నివాళి



వేములవాడరూరల్: కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న యువకులు



చందుర్తి: నివాళి అర్పిస్తున్న యూత్ సభ్యులు

వేములవాడరూరల్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. యువ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మల్యాలలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గిల్ విజయ్ దివస్‌లో స్వామి వివేకానంద యూత్ సభ్యులు శుక్రవారం నివాళి అర్పించారు. లోకోజీ సతీశ్, పాటి సుధాకర్, మోత్కుపల్లి మధు, దుర్శేటి రాజు, పత్తిపాక శ్రీనివాస్, మూడపల్లి ముఖేశ్, గొల్లపల్లి సాయికష్ణ, లచ్చయ్య, గోగులకొండ శివసాయి, బర్రి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బోయినపల్లి పశు వైద్యాధికారి బదిలీ

బోయినపల్లి: బోయినపల్లి పశువైద్యాధికారి రమేశ్ కుంబోజు కరీంనగర్ జిల్లా పశువైద్యాధికారి కార్యాలయానికి శుక్రవారం బదిలీ అయ్యారు. బోయినపల్లి పశువైద్యాధికారిగా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి నుంచి డాక్టర్ సతీశ్ నియమితులయ్యారు. బోయినపల్లి ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆరిఫ్ గంభీరావుపేట మండలానికి బదిలీ అయ్యారు. ఆరిఫ్ స్థానంలో ముస్తాబాద్ మండలం నుంచి సురేశ్ నియమితులయ్యారు. బోయినపల్లి గ్రామ పంచాయతీ క్యాదర్శి రాజసులోచన గంగాదర మండలం మధురానగర్‌కు బదిలీ అయ్యారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం

గంభీరావుపేట: మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుమలత బదిలీపై వేరేచోటుకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, డిప్యూటీ తహసీల్దార్ అపర్ణ, ఆర్ఐ శ్రావణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిష్టంపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన మర్వాడి రాములు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కిందపడగా గాయాలయ్యాయి. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగ్రాత్రుడని ఆస్పత్రికి తరలించారు. అనంతరం రాములు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్ గ్రామ శివారు ఒర్రె నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకొని గొరవేని రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు పనులు పరిశీలన

బోయినపల్లి: మండలకేంద్రంలో మోడల్‌స్కూల్‌కు వెళ్లే రహదారి తాత్కాలిక మరమ్మతు పనులను ఎంపీడీవో బీమా జయశీల శుక్రవారం పర్యవేక్షించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు ఆదర్శ పాఠశాలకు వెళ్లే దారి గుంతలమయమై రోడ్డు అధ్వానంగా మారిందని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపీడీవో తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు రవీందర్ తదితరులు ఉన్నారు.

మద్యంతాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

రుద్రంగి: మద్యంతాగి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన వారికి వేములవాడ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కావేటి సుజన జరిమాన విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలి పారు. ఐదుగురికి రూ.వెయ్యి చొప్పున, ఇద్దరికి రూ.2వేల చొప్పున జరిమాన విధించినట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

ముస్తాబాద్: వానాకాలంలో సక్రమంగా పారిశుధ్య పనులు చేపట్టడం లేదని బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు సమయపాలన పాటించడం లేదని, మురుగుకాల్వలు శుభ్రం చేయించడం లేదన్నారు. ప్రజలు దోమలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులబారిన పడుతున్నారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేటీఆర్ సేన అధ్యక్షుడు మెంగని మనోహర్, యువజనశాఖ అధ్యక్షుడు శీలం స్వామి, పల్లెసత్యం, జహంగీర్, తదితరులున్నారు.

పశువైద్యశాల పనులు పూర్తిచేయాలి

ముస్తాబాద్: పశు వైద్యశాల నిర్మాణ పనులు పూర్తిచేయాలని పాడి రైతులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం మండలంలోని ఆవునూర్‌లో నిలిచిపోయిన పశువైద్యశాల భవన నిర్మాణం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. నిర్మాణానికి రూ.17లక్షలు మంజూరుకాగా, పనులు ఆలస్యంగా మొదలుపెట్టారన్నారు. ఉన్న ఆస్పత్రిని కూల్చివేసి, కొత్త ఆస్పత్రిని నిర్మిస్తున్నారన్నారు. భవనం లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది రావడం లేదని, పనులు వెంటనే పూర్తిచేసి పశువులకు సేవలందించాలని కోరారు. రైతులు గంగాడి బాల్‌రెడ్డి, ఎల్లయ్య, చిన్ని అంజిరెడ్డి, చంద్రయ్య, నక్కల శ్రీనివాస్‌రెడ్డి, చిన్ని బాల్‌రెడ్డి, కాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి వేడుకలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళ హారతులు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా బోనాలు



గంభీరావుపేట: మండలకేంద్రంలో మున్నూరుకాపు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మహంకాళి అమ్మవారి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. నెత్తిన బోనాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సైకియాట్రిస్ట్ ప్రవీణ్

సిరిసిల్లకల్చరల్: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సైకియాట్రిస్ట్ ప్రవీణ్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలతో ఏకాగ్రత లోపించి చదువుపై దుష్ప్రభావం పడుతుందన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ నిర్దేశిత లక్ష్యం వైపు దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. ఏమైనా సమస్యలుంటే 14416 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, హెచ్ఈవో స్వామి, ఎఎన్ఎం కే. ఉమ, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, వాటితో కలిగే జరిగే నష్టాలపై మానసిక వైద్య నిపుణుడు ప్రవీణ్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు గంజాయి, మత్తు పదార్థాలు వంటి చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డాక్టర్ విశ్వేశ్వర్, అధ్యాపకులు అంజయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులను కేటాయించలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ కేటాయింపులపై నిరసన తెలిపి బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. యూనివర్సిటీలకు కేవలం రూ.500 కోట్లు కేటాయించడం సిగ్గుచేటన్నారు. మెస్ బిల్లులు, స్కాలర్ షిప్‌లు గురించి ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, నాయకులు చిగుర్ల అనిల్, రవి, తరుణ్, బాలకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దర్జీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మేర సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల కల్చరల్: దర్జీ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని మేరసంఘం జిల్లా అధ్యక్షుడు ఓదెల శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు మాట్లాడారు. చేతివృత్తుల వారిని బీసీ ఏ లో చేర్చి దర్జీలను బీసీ బీలో చేర్చడం సరికాదన్నారు. ప్రభుత్వం స్కూల్ యునిఫామ్‌లను తయారు చేయించే కాంట్రాక్ట్‌ను దర్జీలకు కేటాయించాలన్నారు. జిల్లాలో సుమారు 5 వేల మంది దర్జీలు దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. స్మాల్ స్కేల్ పరిశ్రమను ఏర్పాటు చేసి దర్జీలకు ఉపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో కీర్తి జయంత్, గట్ల పద్మనాభం, శీలం నగేశ్, కొండ లక్ష్మణ్, దీకొండ శేషగిరి, రామగిరి శ్రీనివాస్, రామగిరి ఈశ్వర్, మోహన్, గణేశ్, తెంబరవేని శ్రీనివాస్, వెన్ను నర్సయ్య, మాడిశెట్టి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ: ప్రభుత్వ బడ్జెట్‌లో వేములవాడ రాజన్నకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్, నాయకులు గుడిసె మనోజ్, వివేక్‌రెడ్డి, బిళ్ల కృష్ణ, నామాల శేఖర్, సగ్గు రాహుల్, అన్నం నర్సయ్య, నేరెళ్ల కిరణ్, మోక్షిత్, ఏధుల అశోక్, అన్నారం శివ, కొరెపు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



కొలనూర్‌లో చెక్కు అందిస్తున్న నాయకులు



రాజన్నపేటలో చెక్కులు అందజేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన కొత్తకొండ నర్సవ్వకు మంజూరైన రూ.15వేలు, ఎండీ ఫిరోజ్‌ఖాన్‌కు రూ.25వేలు సీఎం సహాయనిధి కింద మంజూరుకాగా చెక్కులను గ్రామశాఖ అధ్యక్షుడు బొలగం కమలాకర్, వీరవేని తిరుపతియాదవ్ అందజేశారు. మంత్రి మహేశ్, తాళ్లపెల్లి విజయ్, బిట్ల అశోక్, ఎల్లయ్య, రాజయ్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం, రాచర్ల బొప్పాపూర్, రాజన్నపేట గ్రామాల్లో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం అందించారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శివరాంరెడ్డి, దేవారెడ్డి, నర్సాగౌడ్, దేవరాజు, ఉస్మాన్, నమిలికొండ శ్రీనివాస్, వేర్పుల స్వామి, నర్సయ్య, శంకర్, శరత్‌బాబు, దేవయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి



శ్రీధర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తంగళ్లపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. అనంతరం బీజేపీ నాయకులు శ్రీధర్‌రావును సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యక్షుడు ఇటికల రాజు, మహేందర్, ప్రధాన కార్యదర్శి కాళీచరణ్, బీజేవైఎం అధ్యక్షు డు వినయ్, అరుణ్, మహిళా అధ్యక్షురాలు కోడం భవిత, మోర శ్రీనివాస్, వెంకన్న, నిఖిల్, శ్రీనివాస్, అరవింద్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముసురులోనూ పారిశుధ్య పనులు

వేములవాడ: వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు పట్టణంలోని వీధుల్లో చెత్త పేరుకుపోయింది. శుక్రవారం పారిశుధ్యం సిబ్బంది వర్షంలోనూ పనులు చేశారు. చెత్త సేకరించే సిబ్బంది నెత్తిన కవర్లు, క్యాప్‌లు ధరించి పనులు చేశారు